


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక





ఆదివారం 25-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :127 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

## కాంగ్రెస్ ర్యాలీ వాయిదా వేయండి!


2 లో

రాహుల్‌గాంధీకి సీటీఐ లేఖ

నవంబర్ 1న కాంగ్రెస్ మెగా ర్యాలీ

ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు

మార్కెట్లకు అంతరాయం కలిగే అవకాశం

కొనుగోలుదారులు తగ్గుతారనే ఆందోళన

నవంబర్ 10 వరకు వాయిదా వేయాలని అభ్యర్థన

## జగన్‌పై చంద్రబాబు సెటైర్లు!

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వైసీపీపై చంద్రబాబు తీవ్ర ఆరోపణలు

గత పాలనలో విధ్వంసం

హింసాత్మక ఘటనలపై ఆగ్రహం

రాష్ట్రంలో రౌడీరాజ్యం రానివ్వం

తెలంగాణ నేతల విమర్శలపై స్పందన

ఏపీకి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు

పరిశ్రమలతో యువతకు ఉద్యోగాలు


2 లో

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం):** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన సాధించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఒకప్పుడు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు బయటి శక్తుల నుంచి వచ్చేవని, కానీ ప్రస్తుతం ఓ రాజకీయ పార్టీ నుంచే తీవ్ర ముప్పు ఎదురవుతోందని ఆయన ఆరోపించారు. నేరాలు, రౌడీయిజం చేసే నేతలను ప్రజలు ఎన్నటికీ హర్షించరని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వాతావరణం ఉంటే ఆ రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోవు అని వ్యాఖ్యానించారు.

2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం పరాకాష్టకు చేరిందని, గత పాలకుల తీరు వల్ల తెలుగుజాతి మొత్తం తిరుగుబాటు చేసే పరిస్థితి వచ్చిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేకతను తట్టుకోలేక వైసీపీ హింసను ప్రేరేపిస్తోందని, రాష్ట్రం తగలబడినా తమ రాజకీయ అజెండా నెగ్గాలనే ఆలోచనతో ఆ పార్టీ ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి చివరికి దేశ పౌరుడిగా కూడా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. పంజాబ్ నుంచి కిరాయి ముఠాలను తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, కనిగిరిలో నామినేషన్ కేంద్రంలోకి వెళ్లి పత్రాలు లాక్కోవడం, తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై దాడి చేయడం వంటి అరాచకాలకు ఒడిగట్టారని మండిపడ్డారు.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

రూ.1.1 కోట్ల మెథాంఫెటమిన్ సీజ్

భోపాల్ బస్సులో డీఆర్ఐ తనిఖీలు

పరుపుల కింద డ్రగ్స్ ప్యాకెట్లు

1.136 కిలోల మాదకద్రవ్యాలు స్వాధీనం

నాగ్‌పూర్‌లో దిగిపోయిన ప్రయాణికులు

ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు

డ్రగ్స్ సరఫరా వెనుక ఎవరున్నారు?

2 లో

## రేషన్ షాపుల్లో కొత్త సరుకులు!

ఎల్‌నినో ముప్పుతో ముందస్తు చర్యలు

3.42 కోట్ల మందికి ఆహార భద్రత

14 నెలలకు సరిపడా బియ్యం నిల్వలు

28 లక్షల టన్నుల బియ్యం అంచనా

మిల్లర్లపై అధికారుల పర్యవేక్షణ

నిత్యావసరాల పంపిణీకి ప్రతిపాదన

పేదలపై ధరల భారం పడకుండా చర్యలు


2 లో

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం):** ఎల్‌నినో ముప్పు కారణంగా వర్షపాతం తగ్గి కరవు లేదా పంట నష్టాలు సంభవించినా పేదలపై ధరల భారం పడకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ఎటువంటి ఆహార కొరత రాకుండా 14 నెలలకు సరిపడా బఫర్ స్టాక్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు, పీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం కోసం నెలకు 2.38 లక్షల టన్నులు, అనగా సంవత్సరానికి 28.56 లక్షల టన్నుల బియ్యం అవసరం ఉంది.

## స్పీస్ బాండ్‌పై నేహా బోరా నో!

ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా?

నిరసన తెలిపే హక్కు మాకుంది

ఢిల్లీ పోలీసుల నోటీసును సవాలు చేసిన నేహా

పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

రూ.10 వేల పూచీకత్తు సమర్పించాలని నోటీసు

నేహా వ్యాఖ్యలతో ఢిల్లీలో చర్చలు

2 లో

## ఒప్పందం కుదరకపోతే 'ఎపిక్ ఫ్యూరీ'!

ఇరాన్‌కు ట్రంప్ గట్టి హెచ్చరిక

ఒప్పందం లేకుంటే మరోసారి దాడులు

ఇరాన్ నాయకత్వంపై విమర్శలు

క్యూబాపైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు


అమెరికా పౌరుల విడుదలపై ప్రకటన

హమాస్ చెర నుంచి బందీల విడుదల

స్టీఫెన్ హబ్బార్డ్‌ను వెనక్కి తీసుకొచ్చాం

2 లో

## రిమ్స్‌లో విషాదం.. తల్లి, కవలల మృతి!



2 లో

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం):** ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏడు నెలల గర్భిణీ మృతి చెందగా, ఆమె కడుపులో ఉన్న కవల శిశువులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఒకే ఘటనలో తల్లి, ఇద్దరు శిశువులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



## పథకం రెడీ పేరు పదీ?

- వేల కోట్లతో రేవంత్ భారీ పథకం
- ఎల్‌నినో ఎఫెక్ట్.. కరవు ముప్పు
- తాగునీటి కోసం ముందస్తు ప్రణాళిక
- నాలుగు నెలలు గ్రామాల్లోనే ఉండాలి
- ప్రజాప్రతినిధులపై ఫోన్ లొకేషన్ నిఘా
- చెరువులు, కాల్వల పునరుద్ధరణకు ప్లాన్
- నీటి కష్టాలు..ఆరుతడి సాగుకు ప్రాధాన్యం

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం):** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వచ్చే ఏడాది జులై వరకు కరవు పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రానున్న నెలల్లో ఎండల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని, తాగునీటికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చని హెచ్చరించారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ సాగునీటి కొరత తప్పకపోవచ్చని పేర్కొన్నారు. తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని, ఈ పరిస్థితిని ప్రజలకు ముందుగానే వివరించి అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు.సమస్యను దాచిపెడితే అది మరింత తీవ్రమవుతుందని, ప్రజల భాగస్వామ్యం లేకుండా కరవును ఎదుర్కోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

మిగతాది 2 లో..

## ఎక్స్‌పైర్డ్ ఫుడ్స్‌తో ప్రజారోగ్యానికి ముప్పు!



2 లో

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం):** మహారాష్ట్రలో ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ కు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తీవ్ర షాక్ ఇచ్చింది. తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో భివాండీలో ఉన్న బ్లింకిట్ ప్రధాన వేర్‌హౌస్ ఫుడ్ లైసెన్స్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. అక్టోబర్ 21న నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో సుమారు రూ.32.71 లక్షల విలువైన 18,405 కాలం చెల్లిన (ఎక్స్‌పైర్డ్), దెబ్బతిన్న, తిరస్కరించిన ఆహార పదార్థాలకు సంబంధించి ఎండ్-టు-ఎండ్ ట్రాకింగ్ రికార్డులు గానీ, వాటిని నాశనం చేసినట్లు తగిన ఆధారాలు గానీ కంపెనీ చూపలేకపోయింది.

## ఏపీ వైపు దూసుకొస్తున్న తుపాను


2 లో

వాయుగుండంగా మారే అవకాశం

28న ఏపీ తీరానికి చేరే సూచనలు

మూడు రోజులు భారీ వర్షాలు

కోస్తాంధ్రకు ఈదురుగాలుల ముప్పు

మంగళ, బుధవారాల్లో అతిభారీ వర్షాలు

మత్స్యకారులకు వాతావరణ శాఖ హెచ్చరిక

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జోరు!

నామినేషన్ల దాఖలు పూర్తి

మొత్తం 57,626 నామినేషన్లు

ఎంపీటీసీకు 51,902 నామినేషన్లు

జడ్పీటీసీ కు 5,724 నామినేషన్లు

ఎంపీటీసీలో టీడీపీ ముందంజ

వైసీపీ నుంచి భారీగా నామినేషన్లు

జడ్పీటీసీలోనూ టీడీపీదే ఆధిక్యం

పరిశీలన తర్వాత మారనున్న లెక్కలు



2 లో

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల హీట్ పుట్టిస్తున్నాయి.. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ నెల 23వ తేదీతో అంటే శుక్రవారంతో ముగిసిపోయింది.. ఇక, నామినేషన్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది.. మొత్తం 28 జిల్లాల్లో ఎన్నికలు జరగనున్న 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఇప్పటివరకు 51,902 నామినేషన్లు దాఖలయ్యాయి.

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

ఆదివారం 25-10-2026

# జగన్‌పై చంద్రబాబు సెటైర్లు!

మొదటి పేజీ తరువాయి

రాజకీయ పార్టీగా వైసీపీ చేస్తున్న అరాచకాలను ఉపేక్షిస్తే రాష్ట్రంలో రౌడీరాజ్యం వస్తుందని చంద్రబాబు హెచ్చరించారు. ఎవరి డీఎన్ఏలో నేరచరిత్ర ఉందో ప్రజలందరికీ బాగా తెలుసని, ఇటువంటి హింసాత్మక ఘటనలపై సమాజంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఫేక్ ప్రచారాల ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని, మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే ఏమవుతుందోనన్న భయం ప్రజల్లో ఉందన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు కట్టుబడే పనిచేస్తోందని స్పష్టం చేశారు.

మరోవైపు తెలంగాణ రాజకీయ ప్రస్తావన తెస్తూ.. తాను తెలంగాణలో 30 ఏళ్ల పాటు రాజకీయం చేసినా తనపై ఎలాంటి మచ్చపడలేదని, కానీ ఇప్పుడు అక్కడి నేతలు ఏపీపై విమర్శలు చేయడం విచారకరమన్నారు. జగన్ తన మాట వినని ప్రతి ఒక్కరినీ శత్రువులా చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఏపీ బ్రాండ్' తెచ్చిన నమ్మకంతోనే రాష్ట్రానికి రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని చెప్పారు. వేగంగా అనుమతులు ఇస్తేనే మరిన్ని పరిశ్రమలు వచ్చి యువతకు పెద్దపీట వేసేలా ఉద్యోగావకాశాలు లభిస్తాయని, కేవలం ఒప్పందాలతో ఆగకుండా ఉత్పత్తి దశ వరకు స్వయంగా ఫాలోఅప్ చేస్తున్నామని వివరించారు.

# ఎక్స్‌పైర్డ్ ఫుడ్స్‌తో ప్రజారోగ్యానికి ముప్పు!

మొదటి పేజీ తరువాయి

అనర్హమైన ఈ స్టాక్ తిరిగి వినియోగదారుల చేతికి చేరితే ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందనే ఆందోళనతో ఆ ప్రాంగణంలో సేవలను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు.

లైసెన్స్ సస్పెన్షన్‌తో పాటు.. నిబంధనలను ధిక్కరించిన బ్లింకిట్ కీలక నిర్వాహకులపై ఎఫ్‌డిఏ కఠిన చర్యలకు ఉపక్రమించింది. భివాండీ తాలూకా పోలీస్ స్టేషన్‌లో బ్లింకిట్ హోల్ టైమ్ డైరెక్టర్, ఫెసిలిటీ మేనేజర్లు మరియు స్క్రాప్ తొలగించే పలు ఏజెన్సీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలను లాభాల కోసం తిరిగి విక్రయించేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత 2023లోని మోసం, నేరపూరిత కుట్ర సెక్షన్లతో పాటు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006లోని సెక్షన్ 59(అ) కింద వీరిపై కేసులు నమోదయ్యాయి.

దేశంలోనే అతిపెద్ద ఇ-కామర్స్, రీటైల్, థర్డ్-పార్టీ లాజిస్టిక్స్ హబ్‌గా గుర్తింపు పొందిన భివాండీలో ఈ ఘటన జరగడం సంచలనం సృష్టించింది. పశ్చిమ భారతదేశంలోనే అత్యంత భారీ వేర్‌హౌసింగ్ కేంద్రంగా ఉన్న భివాండీ.. జోమాటో హైపర్‌ప్యూర్, స్విగ్గీ, అమెజాన్, బ్లింకిట్ వంటి ప్రముఖ క్విక్ కామర్స్, ఎఫ్ఎమ్‌సిజి బ్రాండ్‌లకు ప్రధాన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది. నగరం లోపల ఉన్న డార్క్ స్టోర్లకు సరుకులను పంపిణీ చేయడానికి ఇక్కడి నుంచే లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో కార్యకలాపాలు సాగుతుంటాయి.

ఎఫ్‌డిఏ కమిషనర్ తుకారాం ముండే నాయకత్వంలో మహారాష్ట్ర అధికారులు భివాండీలోని వేర్‌హౌస్‌లు, డార్క్ స్టోర్లు మరియు వ్యర్థాల విక్రయ నెట్‌వర్క్‌లపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. కంపెనీలు నాశనం చేయాలని మార్క్ చేసిన స్టాక్‌ను సురక్షితంగా తొలగించకుండా, అక్రమంగా స్థానిక వ్యాపారులకు, డిస్కౌంట్ స్టోర్లకు మళ్లించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ అక్రమ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఫుడ్ కంపెనీలు, వేర్‌హౌస్‌లు, స్క్రాప్ ఏజెన్సీలు, స్థానిక వ్యాపారులకు చెందిన 10 మందిపై పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు.

# ఏపీ వైపు దూసుకొస్తున్న తుపాను



న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం): తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. ఇది ఈరోజు రాత్రిలోగా వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అనంతరం ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ నేడు తీవ్ర వాయుగుండంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. రేపు ఉదయానికి బంగాళాఖాతంలో ఇది తుపానుగా బలపడే సూచనలు ఉన్నాయి.

తుపానుగా మారిన తర్వాత కూడా పశ్చిమ వాయవ్య దిశగానే కదులుతూ మరింత బలపడే అవకాశం ఉంది. ఈనెల 28వ తేదీ ఉదయం నాటికి ఇది ఏపీ తీరానికి దగ్గరగా చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో రానున్న మూడ్రోజుల్లో కోస్తాంధ్ర తీరంలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవడంతో పాటు.. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది.

# రిమ్స్‌లో విషాదం.. తల్లి, కవలల మృతి!

మొదటి పేజీ తరువాయి

ఆమె ఏడు నెలల గర్భిణీగా ఉన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో బీపీ పెరగడంతో ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ప్రసవానికి ముందే సునీత ప్రాణాలు కోల్పోగా, ఆమె కడుపులో ఉన్న కవల శిశువులు కూడా మృతి చెందారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణమా?

సునీత మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి ఆమెకు అందించిన చికిత్స, ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించిన తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, వైద్యుల నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణలు ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఈ నేపథ్యంలో ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, సునీత మృతికి గల కారణాలను వెల్లడించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో రూ.1.1 కోట్ల డ్రగ్స్ పట్టివేత!



న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం): నగరంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భారీ డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేశారు. భోపాల్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రైవేట్ ప్రయాణికుల బస్సులో తనిఖీలు చేపట్టి, సుమారు రూ.1.1 కోట్ల విలువైన 1.136 కిలోల మెథాంఫెటమిన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఖచ్చితమైన నిఘా సమాచారం మేరకు డిఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, స్లీపర్ బెర్త్‌ల పరుపుల కింద అత్యంత చాకచక్యంగా దాచిన నాలుగు అనుమానాస్పద ప్యాకెట్లను గుర్తించారు. ఫీల్డ్-టెస్టింగ్ కిట్ ద్వారా పరీక్షించగా, ఆ ప్యాకెట్లలో ఉన్నది నిషేధిత 'మెథాంఫెటమిన్' అని నిర్ధారణ అయింది.

అధికారుల ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సదరు స్లీపర్ బెర్త్‌లలో ప్రయాణించిన వ్యక్తులు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బస్సు ఎక్కి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో దిగిపోయినట్లు తేలింది. డ్రగ్స్‌ను బస్సులోనే వదిలి వెళ్లడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. పట్టుబడిన 1.136 కిలోల మెథాంఫెటమిన్‌ను ఎన్‌డిపిఎస్ చట్టం, 1985 కింద అధికారులు సీజ్ చేశారు. ఈ డ్రగ్ సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, హైదరాబాద్‌లో ఎవరికి డెలివరీ చేయాలనుకున్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జోరు!

మొదటి పేజీ తరువాయి

అదే విధంగా 659 జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు అందాయి. రెండు విభాగాలను కలిపి మొత్తం 57,626 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఎంపీటీసీ స్థానాలకు 51,902 నామినేషన్లు

ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రొఫార్మా-I (ఏ) నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 9,829 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 23న ఒక్కరోజే 25,016 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య 51,902కు చేరింది. పార్టీల వారీగా చూస్తే, తెలుగుదేశం పార్టీ తరఫున 22,013 నామినేషన్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 20,556 నామినేషన్లు దాఖలయ్యాయి. జనసేన పార్టీ నుంచి 4,609, భారతీయ జనతా పార్టీ నుంచి 1,150, కాంగ్రెస్ పార్టీ నుంచి 463 నామినేషన్లు అందాయి. అలాగే సీపీఐ (ఎం) తరఫున 434, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి 173, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇతర పార్టీల నుంచి 200 నామినేషన్లు రాగా, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2,301 నామినేషన్లు అందాయి.

జడ్పీటీసీ స్థానాలకు 5,724 నామినేషన్లు

జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రొఫార్మా-I (బి) నివేదిక ప్రకారం, 28 జిల్లాల్లోని 659 స్థానాలకు ఇప్పటివరకు 5,724 నామినేషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 23న ఒక్కరోజే 3,315 నామినేషన్లు అందాయి. పార్టీల వారీగా పరిశీలిస్తే, టీడీపీ తరఫున 2,078, వైస్సార్సీపీ నుంచి 1,815, జెఎస్పి నుంచి 679 నామినేషన్లు దాఖలయ్యాయి. ఐఎన్సి తరఫున 315, బీజేపీ నుంచి 255, బిఎస్పి నుంచి 121 నామినేషన్లు వచ్చాయి. ఇతర పార్టీల నుంచి 111, సిపిఐ (ఎం) నుంచి 74, ఏఏపి నుంచి 13 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 263 నామినేషన్లు అందినట్లు నివేదిక వెల్లడిస్తోంది.

రెండు విభాగాల్లో కలిపి 57,626 నామినేషన్లు

అక్టోబర్ 23, 2026 నాటి నివేదిక ప్రకారం, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కలిపి మొత్తం 57,626 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఎంపీటీసీ స్థానాలకు 51,902, జడ్పీటీసీ స్థానాలకు 5,724 నామినేషన్లు ఉన్నాయి. అయితే, ఈ సంఖ్యలు దాఖలైన నామినేషన్లకు సంబంధించినవే. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య మారే అవకాశం ఉంటుంది.

# రేషన్ షాపుల్లో కొత్త సరుకులు!

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత అంచనాల ప్రకారం రాష్ట్ర బఫర్ గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, మిల్లుల నుంచి రావాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ , ఇతర వనరుల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు అందనున్నాయి. ఇవన్నీ కలిపి సుమారు 28.03 లక్షల టన్నుల బియ్యం లభ్యం కానుండగా, ఇవి 2027 సెప్టెంబర్ వరకు సరిపోతాయని భావిస్తున్నారు.

మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం గడువులోగా గోదాములకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాకుండా, కష్టకాలంలో ప్రజలకు మరింత ఊరటనిచ్చేందుకు రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యమే కాకుండా గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి వంటి ఇతర నిత్యావసర సరుకులను కూడా అందించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. భవిష్యత్తులో ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా ప్రజల ఆహార భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా ఈ కార్యాచరణను అమలు చేస్తున్నారు.

# కాంగ్రెస్ ర్యాలీ వాయిదా వేయండి!



న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం): 'ఓటును కాపాడండి.. దేశాన్ని కాపాడండి' అంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో నవంబర్ 1న మెగా ర్యాలీ చేపట్టింది. అయితే ఈ ర్యాలీపై వ్యాపారవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి వంటి పెద్ద పండుగలు ఉన్న నేపథ్యంలో ర్యాలీని వాయిదా వేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి ఢిల్లీలోని ప్రముఖ వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సంస్థ అయిన ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ లేఖ రాసింది. ర్యాలీని దీపావళి వరకు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. పండుగల సమయంలో వ్యాపారం దెబ్బతింటుందని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీకి రాసిన లేఖలో సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ ఇలా పేర్కొన్నారు. 'నవంబర్ 1వ తేదీన రామ్‌లీలా మైదాన్‌లో మీ పార్టీ ఒక భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. ప్రస్తుతం దీపావళి వ్యాపారం జోరుగా సాగుతున్నందున ఈ ర్యాలీని నవంబర్ 10వ తేదీ వరకు వాయిదా వేయాలని మేము వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాము." అని కోరారు.

ర్యాలీ కారణంగా ట్రాఫిక్ మళ్లింపులు, మెట్రో స్టేషన్ల మూసివేతలు, బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటివి మార్కెట్లకు పూర్తి అంతరాయం కలిగిస్తాయని పేర్కొన్నారు. ర్యాలీ సమయంలో రోడ్ల మూసివేత, జనసమూహాల వల్ల ఢిల్లీ బయట నుంచి రాకపోకలు సాగించే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగవచ్చని, భయం కారణంగా కొనుగోలుదారులు ఢిల్లీకి రావడం మానుకోవచ్చని.. ఇది ధంతేరస్, దీపావళి వ్యాపారంపై నేరుగా ప్రభావం చూపుతుందని గోయల్ తెలిపారు.

# ఒప్పందం కుదరకపోతే 'ఎపిక్ ఫ్యూరీ'!



న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. వాషింగ్టన్‌తో దౌత్య ఒప్పందానికి టెహ్రాన్ ముందుకు రాకపోతే మళ్లీ సైనిక దాడి చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అవసరమైతే "మరో చిన్న ఎపిక్ ఫ్యూరీ" తరహా దాడి చేపట్టవచ్చని వార్నింగ్ ఇచ్చారు. ఫ్లోరిడాలో నిర్వహించిన ప్రచార సభలో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ నాయకత్వంపై విమర్శలు చేస్తూ తన ప్రభుత్వ జాతీయ భద్రతా నిర్ణయాలను ప్రస్తావించారు. "ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే మరో చిన్న ఎపిక్ ఫ్యూరీ చేయాల్సి రావచ్చు.. లేకపోతే వాళ్లే ఒప్పుకుంటారు" అని ట్రంప్ అన్నారు. "వాళ్లు తెలివిగా ఉంటే 'సరే.. చర్చలు మొదలుపెడదాం' అంటారు. కానీ అలా చేస్తారో లేదో నాకు సందేహమే" అంటూ ఇరాన్ నాయకత్వంపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.

క్యూబాపైనా వ్యాఖ్యలు

ప్రసంగంలో ట్రంప్ కరీబియన్ ప్రాంతంలో ఉన్న అమెరికా నౌకాదళాన్ని కూడా ప్రస్తావించారు. మధ్యప్రాచ్యం నుంచి తిరిగి వస్తున్న యుద్ధ నౌకలు క్యూబా తీరానికి చేరుకోవచ్చని, అక్కడి నుంచి ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియోను దౌత్యపరమైన చర్యల కోసం పంపుతామని వ్యాఖ్యానించారు. విదేశాల్లో నిర్బంధంలో ఉన్న అమెరికా పౌరులను స్వదేశానికి తీసుకురావడంలో తన ప్రభుత్వం విజయవంతమైందని ట్రంప్ పేర్కొన్నారు. హమాస్ దగ్గర ఉన్న 28 మంది బందీలను వారి కుటుంబాలకు తిరిగి చేర్చామని.. జీవించి ఉన్నవారితో పాటు మృతదేహాలను కూడా అప్పగించారని చెప్పారు. అలాగే రష్యాలో నిర్బంధంలో ఉన్న అమెరికా పౌరుడు స్టీఫెన్ హబ్బార్డ్‌ను కూడా తిరిగి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

అమెరికాలో వృద్ధుల సంరక్షణ కేంద్రాల్లో నర్సుల కొరతను తీర్చేందుకు 250 మిలియన్ డాలర్ల ఫెడరల్ పెట్టుబడిని ప్రకటించారు. ఈ నిధులతో దేశవ్యాప్తంగా కనీసం 5,000 మంది కొత్త నర్సులను నియమిస్తామని, ఫ్లోరిడా సహా పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తామని ట్రంప్ తెలిపారు.

# పీస్ బాండ్‌పై నేహా బోరా నో!



న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం): భారతీయ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, ఢిల్లీ పోలీసులు జారీ చేసిన శాంతి హామీ పత్రంపై సంతకం చేసేందుకు నిరాకరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం శాంతికి భంగం కలిగించడం ఎలా అవుతుంది? మేము ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోతే, ఎవరి శాంతిని కాపాడుతున్నట్లు అని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇవాళ నేహా బోరా ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు అని, ఈ హక్కును 'శాంతిభద్రతల ఉల్లంఘన'గా చిత్రించడం సరికాదని స్పష్టం చేశారు. పీస్ బాండ్‌పై సంతకం చేయడం అంటే తమ ప్రజాస్వామ్య నిరసన హక్కును వదులుకోవడమేనని నేహా బోరా కామెంట్ చేశారు.

కాగా, అక్టోబర్ 16న 'లెహరా దో తిరంగా' ప్రదర్శన, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జరిగిన నిరసనల్లో పాల్గొన్న క్రమంలో ఢిల్లీ పోలీసులు నేహా బోరాను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె విడుదలకు రూ.10 వేల విలువైన పీస్ బాండ్, పూచీకత్తు సమర్పించాలని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ నేహా బోరా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. అయితే, తుది ఉత్తర్వులు ఇచ్చే ముందు సంబంధిత పత్రాలను బోరాకు అందించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించిన నేపథ్యంలో నేహా బోరా వ్యాఖ్యలు దేశ రాజధానిలో హాట్ టాపిక్‌గా మారాయి.

# పథకం రెడీ పేరు ఏదీ?

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం ప్రజాభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లతోపాటు పలు అంశాలపై చర్చించారు. కరవు పరిస్థితులపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని, ఎలాంటి విషయాలను దాచిపెట్టవద్దని ప్రజాప్రతినిధులకు సూచించారు.



సంక్రాంతి తర్వాత నాలుగు నెలల పాటు ప్రజాప్రతినిధులంతా పూర్తిస్థాయిలో గ్రామాల్లోనే ఉండేలా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ పథకం అమలుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు రహదారుల నిర్మాణం, చెరువులు, కుంటలు, కాల్వల పునరుద్ధరణకు అవసరమైన మట్టి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతోపాటు నీటి సంరక్షణ, వ్యవసాయ అవసరాలు నెరవేర్చేలా కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. ప్రతి కుటుంబానికి కడుపునిండా అన్నం దొరికేలా.. ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తగిన పేరును సూచించాలని ప్రజాప్రతినిధులను కోరారు.

గ్రామ వార్డు సభ్యుడి నుంచి ఎంపీ వరకు ప్రతి ఒక్కరూ నాలుగు నెలల పాటు గ్రామాల్లో పర్యటించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటున్నారా లేదా అన్నది తెలుసుకునేందుకు వారి ఫోన్ లొకేషన్ మ్యాప్‌ను పరిశీలిస్తామని తెలిపారు. ఈ పర్యవేక్షణకు సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందిస్తారని, గ్రామాలకు వెళ్లని వారిపై చర్యలు తీసుకునే బాధ్యతను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అప్పగిస్తామని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను పర్యవేక్షించేందుకు రామకృష్ణారావును ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గాంధీభవన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, దాని పర్యవేక్షణ బాధ్యతను ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అప్పగించాలని సూచించారు.

రాష్ట్రంలో విద్యుత్ సమస్య కూడా తీవ్రంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగంలో స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. భూగర్భ జలాలు అందుబాటులో లేనప్పుడు విద్యుత్ సరఫరా చేసినా పంటలకు నీరు అందించడం కష్టమవుతుందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిక పెట్టుబడులతో పంటలు సాగు చేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితులు ఎదురైనా ప్రతి కుటుంబానికి పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కరవు ప్రభావాన్ని తగ్గించేందుకు నీటి సంరక్షణ, గ్రామీణ ఉపాధి, వ్యవసాయ ప్రణాళికలను సమన్వయం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు పరిస్థితులను స్పష్టంగా వివరించి, వారి సహకారంతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# 'నా ఇంట్లో అంజలి పెళ్లి వద్దు'

## షర్మిల కూతురి మ్యారేజ్‌కి జగన్ నిరాకరణ



న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (ఇది కద నిజం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాసిన ఓ లేఖ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. షర్మిల కుమార్తె అంజలి వివాహ వేదికకు సంబంధించి ఈనెల 9న జగన్ రాసిన ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన మేనకోడలు అంజలి వివాహ వార్త విని ఎంతో సంతోషించానని లేఖలో జగన్ పేర్కొన్నారు. 'మన మధ్య ఎన్నో విభేదాలు, రాజకీయ పరిణామాలు ఉన్నప్పటికీ అంజలి జీవితాంతం ఎంతో సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని జగన్ ఆకాంక్షించారు. అయితే అంజలి వివాహాన్ని బెంగళూరులోని తన నివాసంలో జరిపించాలని షర్మిల కోరుకుంటున్నట్లు తనకు తెలిసిందని, అయితే అక్కడ పెళ్లి నిర్వహిస్తే తీవ్ర భద్రతా సమస్యలతో పాటు వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని లేఖలో వివరించారు. పెళ్లికి వచ్చే వందలాది మంది అతిథులు, ఈవెంట్ మేనేజ్మెంట్ సిబ్బంది వల్ల భద్రతా పర్యవేక్షణ కష్టమవుతుందని పేర్కొన్నారు.

నా పిల్లలకైనా ఇదే నిర్ణయం..

తన కుమార్తెలు హర్ష, వర్షల వివాహాల విషయంలో కూడా బెంగళూరు నివాసాన్ని అనుమతించేవాడిని కానని, కుటుంబ సభ్యులందరికీ ఒకే భద్రతా ప్రమాణం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బెంగళూరు నివాసానికి బదులుగా హైదరాబాద్‌లోని 'లోటస్ పాండ్' నివాసంలోనే అంజలి పెళ్లిని ఎంతో ఘనంగా నిర్వహిద్దామని సూచించారు. అలా కాకపోతే అంతకుముందు రాజారెడ్డి పెళ్లి జరిపినట్లుగా ఏదైనా కన్వెన్షన్ సెంటర్ లేదా డెస్టినేషన్ వెడ్డింగ్ వేదికగా ఎంచుకోవాలని కోరారు. దయచేసి వివాహ వేదికను మార్చుకోవాలని సోదరి షర్మిలకు విజ్ఞప్తి చేశారు.

హాట్ టాపిక్‌గా మారిన లేఖ..

వైఎస్ కుటుంబంలో కొన్నాళ్లుగా ఆస్తి, రాజకీయ విభేదాలు నడుస్తున్న తరుణంలో, మేనకోడలి పెళ్లి వేదికపై జగన్ రాసిన లేఖ బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఒకవైపు కుటుంబ సభ్యురాలిపై ప్రేమను వ్యక్తం చేస్తూనే, భద్రత పేరుతో బెంగళూరు ఇంటికి నో చెప్పడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 25-10-2026

# ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి అభివృద్ధికి పట్టంకట్టండి



ఇది కద నిజం: చింతలపూడి మండలం, ప్రగడవరం పంచాయతీలోని వెలగలపల్లి గ్రామంలో స్థానిక ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలలో భాగంగా ప్రగడవరం ఎంపీటీసీ- 2 అభ్యర్థిని చిలుకూరి ప్రసన్న కుమారితో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చింతలపూడి మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, తనకూటమి ఎన్ని కుట్రలు చేసిన, ప్రజలు వైసిపి ఫ్యాన్ గుర్తుకు ఓటువయ్యాడానికి సిద్ధంగా ఉన్నారని. వెలగలపల్లి గడ్డ ఎప్పటికి వైసిపి అడ్డ నే అని అన్నారు. రానున్న జడ్పీటిసి ఎంపీటీసీ ఎన్నికలలో నవంబర్ 3న జరిగే ఎలక్షన్ లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎంపీటీసీ అభ్యర్థిని చిలుకూరి ప్రసన్న కుమారికి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు





ఇది కద నిజం, యాదగిరిగుట్ట :యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు పాల్గొన్న జి.శ్రీనివాస్ ఐఏఎస్ , సెక్రటరీ నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ (చీజూజ), న్యూ ఢిల్లీ. ఆలయ సంప్రదాయల తో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు. ధర్మాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రిటైర్డ్ ఐఏఎస్. ఆలయంలో తీర్థ ప్రసాదం అందజేసిన ఆలయ అర్చకులు. ప్రధాన ఆలయం ముఖమండపంలో బంగారు పుష్పలతో సువర్ణ పుష్పార్చన చేశారు.దర్శన అనంతరం వేద మండపం వద్ద వేదశీర్వచనం చేసిన వేదపండితులు.స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేసిన ఆలయ అధికారులు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో సైబర్ క్రైమ్, డ్రగ్స్ అవగాహనపై పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమం





ఇది కద నిజం:యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాల నివారణలో ప్రజలు, పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశం. మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్‌కు ఎలా దూరంగా ఉండాలనే అంశాలపై వ్యాసాలు రాయించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యువతలో సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ కోరింది.

# వెంకట సాయి నగర్ కాలనీలో ఎస్ఎస్ మార్ట్ ప్రారంభం

## డాక్టర్ విద్యాసాగర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రామంతాపూర్, హైదరాబాద్, అక్టోబర్ 24, 2026: హైదరాబాద్‌లోని రామంతాపూర్ వెంకట సాయి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ మార్ట్ ను ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యజమాని డాక్టర్ విద్యాసాగర్‌ను, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి, నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు ఎ. విజయేందర్ రెడ్డి, కాలనీ గౌరవ సభ్యులు గోపాల్, సత్తయ్య యాదవ్, రవి కుమార్,శివశంకర్, సంజీవ తదితరులు డాక్టర్ విద్యాసాగర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవ కమిటీ సభ్యులు ఆర్. గోవింద్, జి. అశోక్, శ్రీనివాస్ గౌడ్, కే. నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, రామకృష్ణ, శివకుమార్, బి. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

## సీఎస్ సంజయ్ జాజు



ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా, కలెక్టరేట్ కార్యాలయంలో,రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం-2025 కింద పీఎం రాహత్ పథకం అమలుపై రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారు. పీఎం రాహత్ పథకం అమలు విధానం, ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదల, తదితర అంశాలను ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో తగిన చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ (లేదా) పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు.

పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ-డీఏఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణలు, ఆమోదాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు నమోదైన కేసులకు సంబంధించి ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు వెంటనే పరిశీలించి ఈ-డీఏఆర్ పోర్టల్‌లో ఆమోదించాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. ప్రమాద వివరాల నమోదు (లేదా) పోలీసు ధ్రువీకరణలో జాప్యం కారణంగా బాధితులకు చికిత్స అందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు. ఆసుపత్రులు సమర్పించిన చికిత్స క్లెయిమ్‌లను సంబంధిత పోర్టల్‌లో పరిశీలించి ఆమోదించిన అనంతరం, పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (PFMS) ద్వారా ఆసుపత్రులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు.

పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, పెండింగ్ కేసులు, క్లెయిమ్‌ల ఆమోదం, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు.

జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి, ఈ-డీఏఆర్, పీఎం రాహత్ పోర్టల్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు చికిత్స పూర్తికాకముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారం అందించడం, క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పీఎం రాహత్ పథకం కింద జిల్లాలోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్ నమోదు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లోస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సాత్విక్,డీఎంహెచ్ఓ మనోహర్, ట్రాఫిక్ డియస్ పి ప్రభాకర్ రెడ్డి,జిల్లా రవాణా అధికారి నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# పిట్లం మండలంలో రెండు ఆవుల చోరీ

## అర్ధరాత్రి ఆవులను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గద్దగుండు తండా వద్ద జాతీయ రహదారి NH-161 పక్కన కట్టేసిన ఒక ఆవుతో పాటు, పోతిరెడ్డిపల్లిలో మరో ఆవును గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి దొంగిలించినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పిట్లం ఎస్సై బి ఆంజనేయులు తెలిపారు. నేరస్థలాలను పరిశీలించి, ఆవుల చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఊర్లో అపరిచిత వ్యక్తులు తిరిగినచో సమాచారం అందించాలని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ నేతల వినతి



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో పనిచేస్తున్న దళిత వర్గాల ఉద్యోగులకు తక్షణమే ప్రమోషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గం ఇన్చార్జి, ఎమ్ఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ డిమాండ్ చేశారు. దళిత ఉద్యోగుల హక్కులకు భంగం కలగకుండా, వారికి రావాల్సిన ప్రమోషన్లలో అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నల్ల చంద్రస్వామి మాదిగ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా యాదగిరిగుట్ట దేవస్థానంలో అర్హులైన దళిత వర్గ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారని, అదే సమయంలో ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఉద్యోగులకు మాత్రం ప్రమోషన్ ఆర్డర్లు జారీ చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, కొందరు బీసీ కేటగిరీ కింద ఉద్యోగాల్లో చేరి, నేడు ఎస్సీ కేటగిరీ ప్రయోజనాలు పొందడానికి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ మోసపూరిత విధానాలకు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ అంశాలపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని, నిజమైన అర్హత కలిగిన దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఒకవేళ దళిత వర్గాలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు ప్రత్యక్ష ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు బీబీనగరం లక్ష్మణ్ మాదిగ, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షుడు పూలేపాక విజయ్ మాదిగతో పాటు పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు

## ఆరుతడి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలి



ఇది కద నిజం:ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడెం మండల రైతు వేదికలో రైతులకు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు.

నీటి లభ్యత తగ్గే పరిస్థితుల్లో వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేసుకునే పంటలను ఎంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా నల్లరేగడి భూములు, పరిమిత నీటి వసతి ఉన్న పొలాల్లో శనగ సాగు ద్వారా అందుబాటులో ఉన్న నేల తేమను సమర్థంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. వర్షపాతం, నేలలో తేమ, నీటి వనరుల లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు గోవ్రి నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ తనయుడు ఆంజనేయులు, పద్మారం మాజీ సర్పంచ్ నర్సింలు, రఘురాములు, జె. రవి, సుధాకర్, నాగేందర్, దామోదర్, వ్యవసాయ విస్తరణ అధికారులు సోనీశ్రీ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు..

# యువతిపై ఇద్దరు మైనర్లు అత్యాచార యత్నం

## ఇద్దరు మైనర్లకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



ఇది కద నిజం : బాన్సువాడలోని డబుల్ బెడ్‌రూం గృహాల సమీపంలో సమయంలో యువతిపై ఇద్దరు మైనర్లు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. యువతిపై అత్యాచార యత్నం జరుగుతున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని ఇద్దరు మైనర్లను పట్టుకున్నట్లు సమాచారం. అనంతరం వారిద్దరికీ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ఈ ఘటనపై స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, పోలీసులు విచారణ చేపట్టి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 25-10-2026

# సినిమా న్యూస్

## బ్రిటిషర్లకు సింహాస్వప్నం




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నుంచి వచ్చిన 'ఫైల్ నెం.25 : ఫౌజీ' ఒరిజినల్ గ్లింప్స్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో, నేతాజీ సుభాష్ చంద్రబోస్ – అడాల్ఫ్ హిట్లర్ మధ్య సాగే సీరియస్ సంభాషణతో మొదలయ్యే ఈ వీడియోలో డార్లింగ్ ఫ్యాన్స్‌కి మామూలు హై ఇవ్వదు.

"రెండు వందల ఏళ్లుగా బ్రిటీషర్ల కింద బానిసలుగా ఉన్న మీ రక్తం ఓడిపోయే యుద్ధం చేస్తుంది, నేను మద్దతివ్వను" అని హిట్లర్ కించపరిచేలా మాట్లాడగా.. "భారతీయుల గురించి నీకేం తెలీదు హిట్లర్.. నీ సపోర్ట్ ఉన్నా లేకపోయినా నా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి తీరతా" అని బోస్ బదులిచ్చే సీన్ పీక్స్‌లో ఉంది. అక్కడితో ఆగకుండా సింగపూర్‌లో బ్రిటీష్ సేనలను జపాన్ ఎలా చిత్తు చేసిందో వివరిస్తూ.. "కేవలం ఒక్క భారతీయుడు బ్రిటీష్ ఇంటెలిజెన్స్‌ను కుప్పకూల్చాడు, వాళ్ల ఆపరేషన్లను దెబ్బతీశాడు. సైనికుడు, వ్యూహకర్త, అలాగే స్పై అయిన అతనే ఫౌజీ" అంటూ బోస్ రివీల్ చేసే విధానం సినిమాపై హైప్‌ను ఆకాశానికి తీసుకెళ్లింది.

అంతేకాదు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన హిట్లర్ 'ఎనిగ్మా' కోడ్ కంటే భగవద్గీత ఆధారంగా మన 'ఫౌజీ' సృష్టించిన సీక్రెట్ కోడ్‌ను క్రాక్ చేయడం బ్రిటీషర్లకు అసాధ్యంగా మారిందనే పాయింట్ రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. చివర్లో ప్రభాస్ పవర్‌ఫుల్ వాయిస్‌తో "హే బ్రిటీషర్.. నీ రక్తాన్ని కళ్లజూసి నా దేశ స్వాతంత్ర్యాన్ని బలంగా లాక్కుంటా" అంటూ చెప్పే భారీ డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. పీరియాడిక్ వార్ డ్రామాగా రూపొందుతున్న ఈ భారీ చిత్రం 2027 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## సైనికుడిగా గోపీచంద్

మాచో స్టార్ గోపీచంద్ ప్రస్తుతం 'సింగ' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంతో ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వి. వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'సింగ' సినిమా చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయినట్లు చిత్రబృందం వెల్లడించింది.



దీంతో ఈ ప్రాజెక్టుపై సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. గోపీచంద్ గతంలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఆయన దూకుడైన రూపంతో ఆకట్టుకోగా, తాజాగా విడుదలైన పోస్టర్ మరో ప్రత్యేకతను సంతరించుకుంది.

తాజా పోస్టర్‌లో గోపీచంద్ సైనికుడి పాత్రలో కనిపిస్తూ పవర్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆయన పాత్రలోని ఎమోషన్, యాక్షన్ నేపథ్యం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ చిత్రంలో గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోంది? కథలో ఎలాంటి మలుపులు ఉంటాయి? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాతో అనార్కలి నాజర్ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు, ఆసక్తికరమైన కథాంశం, భావోద్వేగాలతో కూడిన నాటకీయ అంశాలతో ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా చిత్రబృందం పనిచేస్తోంది.

దర్శకుడిగా వి. వెంకట్‌కు ఇది తొలి సినిమా కావడం, గోపీచంద్ సైనికుడి పాత్రలో కనిపించనుండటంతో 'సింగ'పై ఆసక్తి నెలకొంది. సినిమా విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్రబృందం త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం గోపిచంద్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఫ్యామిలీ మ్యాన్ కాదు ఫుల్ వైలెంట్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ అనగానే అందరికీ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ లేదా కడుపుబ్బా నవ్వించే కామెడీ గుర్తుకొస్తుంది. కానీ, తాజాగా రిలీజ్ అయిన 'ఆదర్శ కుటుంబం (ఏకే-47)' అఫీషియల్ ట్రైలర్ చూసిన తర్వాత సినీ ప్రియుల మైండ్ బ్లాంక్ అవుతోంది. టైటిల్ క్లాస్‌గా కనిపిస్తున్నా.. కంటెంట్ మాత్రం అంతకుమించిన క్రైమ్, వైలెన్స్‌తో నిండిపోయి థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తోంది.

ట్రైలర్ ప్రారంభంలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ కష్టాలు, సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యంపై వెంకీ వేసే క్లాసిక్ త్రివిక్రమ్ మార్క్ పంచ్‌లతో సరదాగా మొదలవుతుంది. "మిడిల్ క్లాస్ వాళ్ల దగ్గర అమ్మడానికి ఆస్తి ఉండదు, కొనడానికి డబ్బులుండవు.. లేదని ఒప్పుకోవడానికి మొహమాటం, ఉందని చెప్పుకోవడానికి పరువు తప్ప" అంటూ సాగే డైలాగులు అలరిస్తాయి. అయితే తర్వాత కథ ఒక్కసారిగా ఊహించని మలుపు తిరుగుతుంది. ఒక భారీ నేర సామ్రాజ్యం, హత్యలు, దొంగతనాల చుట్టూ ఇన్వెస్టిగేషన్ మొదలవుతుంది.

అక్కడ నుంచి ట్రైలర్ అసలైన వైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోతుంది. "ఒక మనిషి మృగంగా మారడం అనేది ఒక ప్రాసెస్.. ఒక ఎవల్యూషన్" అంటూ వెంకటేష్ చెప్పే డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. చేతిలో కత్తి పట్టుకుని నెత్తుటి మరకలతో శత్రువులను వేటాడుతున్న వెంకీ మామ రౌద్ర రూపం మునుపెన్నడూ చూడని రీతిలో ఉంది. "పెళ్లాన్ని కళ్లముందే కొడుతుంటే మొగుడికి ఎలా ఉంటుందో తెలుసా.. ఒక్క చేత్తో భూమిని తలకిందులు చేయాలనిపిస్తుంది", "జైలు నాకు కొత్త కాదు.. నా కుటుంబమే నాకు ముఖ్యం" అంటూ ఆయన ఇచ్చే ఎమోషనల్ వార్నింగ్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. చివర్లో "ఆరు నెలల క్రితం నువ్వు చేసిన తప్పు ఆరడుగుల షేప్ తీసుకుంటే.. అది నేను" అంటూ వెంకీ ఇచ్చే ముగింపు ట్రైలర్‌లో హైలెట్‌గా నిలిచింది. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. ఈ క్రైమ్, బ్లాక్ కామెడీ థ్రిల్లర్ అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది.




## వీఎఫ్ఎక్స్ దెబ్బ 'స్వయంభూ' వాయిదా?

యువ నటుడు నిఖిల్ కెరీర్‌లో మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఈ సినిమా విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కోసం నిఖిల్ తన శారీరక రూపాన్ని పూర్తిగా మార్చుకోవడంతో పాటు, ప్రత్యేక శిక్షణ తీసుకుని పాత్రకు తగిన మేకోవర్‌పై భారీగా సమయం కేటాయించారు. అత్యున్నత ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ సుమారు 150 రోజుల పాటు సాగింది. అయితే రెండేళ్ల క్రితమే షూటింగ్ పూర్తయినప్పటికీ, ఈ సినిమా ఇప్పటివరకు ప్రేక్షకుల ముందుకు రాకపోవడం సినీ వర్గాల్లోనూ, అభిమానులలోనూ చర్చనీయాంశంగా మారింది.

వాస్తవానికి 'స్వయంభూ' విడుదలకు సంబంధించి గతంలో పలు తేదీలను పరిశీలించినప్పటికీ, వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ చిత్రానికి అత్యంత కీలకమైన విజువల్ ఎఫెక్ట్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. భారీ విజువల్స్‌తో కూడిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా, అత్యుత్తమ క్వాలిటీతో ప్రేక్షకులకు అందించాలనే పట్టుదలతో మేకర్స్ ఉన్నారు.

మరోవైపు, రాబోయే నెలల్లో బాక్సాఫీస్ బరిలో పలు పెద్ద సినిమాలు నిలుస్తుండటంతో 'స్వయంభూ' చిత్రానికి సరైన సోలో రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేయడం చిత్రబృందానికి కొంత సవాల్‌గా మారింది. ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నిఖిల్, ఈ సినిమాతో మరోసారి తన సత్తా చాటాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే చిత్రబృందం సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

